


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 16-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 364 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## తెలంగాణ ఓటర్లకు అలర్ట్

### జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..!



2 లో

**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలో ఈ నెల 25 నుంచి ఓటర్ల ప్రత్యేక 'సమగ్ర సవరణ సర్వే' (సర్) జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 15 నుంచి 24 వరకు మూడు దశలుగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటి దశలో సర్ సర్వే నిర్వహణ అధికారులు బిఎల్‌ఓలకు వారు చేపట్టాల్సిన బాధ్యతలు వంటి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందిస్తారు.

## కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** ఢిల్లీ వేదికగా జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన సేన ప్రస్థానం.. దేశ సమగ్రత కోసం సేనా ప్రస్థానం కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కల్యాణ్, తెలంగాణ ఏర్పాటు, కాంగ్రెస్ నేతల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమగ్రత జనసేన సిద్ధాంతమని, దేశ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే జనసేన లక్ష్యమని, అందుకే ఢిల్లీలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

అలాగే జనసేన పార్టీ ఎప్పుడు తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా కాదని, విభజన చేసిన తీరుకు తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. అలాగే జనసేన పార్టీ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని, తమను అడ్డుకునేందుకే ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ నేతలు తమపై తీవ్ర విమర్శలు చేశారని, నేటికి కూడా కాంగ్రెస్ తీరు మారలేదని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాగే సేనా ప్రస్థానం లక్ష్యాలను పార్టీ కార్యకర్థకలకు, నేతలకు వివరించారు. జనసేన పార్టీకి ఎల్లప్పుడూ సొంత ప్రయోజనాల కంటే దేశ సమగ్రత, శ్రేయస్సే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. దేశ స్ఫూర్తిని, జాతీయ సమైక్యతను కాపాడుకోవడం అనేది ఒక్కరోజుతో ముగిసే పనికాదని, ప్రతి తరం దీనిని బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.


2 లో

# తెలంగాణలో డిజిటల్ పాలన

## ఈ-కేబినెట్‌కు గ్రీన్ సిగ్నల్!

- ☼ పేపర్‌లెస్ పాలనకు వేగం
- ☼ ట్యాబ్‌లతోనే మంత్రివర్గ సమావేశాలు
- ☼ ఫైళ్లకు గుడ్‌బై.. డిజిటల్‌కు వెల్‌కమ్
- ☼ కేబినెట్ అజెండా ఇక ఆన్‌లైన్‌లోనే
- ☼ రహస్య సమాచారానికి పటిష్ట భద్రత
- ☼ పారదర్శక పాలనకు మరో అడుగు
- ☼ కాగితాల ఖర్చుకు చెక్
- ☼ స్మార్ట్ గవర్నెన్స్ వైపు తెలంగాణ
- ☼ ప్రతి నిర్ణయం డిజిటల్ రికార్డు
- ☼ ఈ-గవర్నెన్స్‌లో తెలంగాణ దూకుడు
- ☼ సీఎస్ సమీక్షతో ఏర్పాట్లు వేగవంతం
- ☼ డిజిటల్ కేబినెట్‌కు సర్వం సిద్ధం




**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనా విభాగంలో సరికొత్త డిజిటల్ విప్లవానికి తెరలేవనుంది. రాష్ట్ర కేబినెట్ సమావేశాలను ఇకపై పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పరిపాలనా రంగాన్ని ఆధునీకరించడంతో పాటు, ప్రభుత్వ సమాచార మార్పిడిలో వేగం, పారదర్శకతను తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సచివాలయం, వివిధ డైరెక్టరేట్లు, కమిషనరేట్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో విడతల వారీగా పేపర్‌లెస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం అధికారులకు గతంలోనే సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ సమావేశాలను సైతం డిజిటలైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ సరికొత్త విధానం అమల్లోకి వస్తే.. కేబినెట్ సమావేశాల్లో మంత్రుల ముందు ఎలాంటి ఫైళ్లు, కాగితపు పత్రాలు కనిపించవు. వీటికి బదులుగా మంత్రులందరికీ అత్యాధునిక ట్యాబ్‌లను అందజేయనున్నారు. ఈ ట్యాబ్‌లకు అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సదుపాయాలను సమకూర్చే పనిలో ఐటీ, సాధారణ పరిపాలన శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ రూపొందించిన అత్యంత సురక్షితమైన సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది.

మిగతాది 2 లో..

## తీవ్ర సంక్షోభం.. ఆదుకోండి

### చంద్రబాబుకు బీజేపీ స్టేట్ అధ్యక్షుడి లేఖ


2 లో

**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతి భారీగా వచ్చిన పంటకు సరైన రేటు లేకపోవడంతో నష్టపోతున్నారు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ప్రతి పార్టీ నాయకులకు తమ పరిస్థితిని విన్నవించుకుంటున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించారు.

## నేడు ఇందిరా గాంధీ బ్రతికి ఉంటే బీజేపీని బ్యాన్ చేసేవారు: మాజీ సీఎం అశోక్ గెహ్లాట్


2 లో

**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అశోక్ గెహ్లాట్.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ!


2 లో

**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. మెట్రో టేకోవర్?పై సందిగ్ధత ఏర్పడడంతో నెక్స్ ఏం చేయాలన్న అంశంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం

### పోలీసుల అదుపులో మహిళ


2 లో


**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం రేగింది. ఉచిత పథకాలు వద్దు అంటూ సచివాలయం మీడియా సెంటర్ వద్ద గోడలకు పోస్టర్లు ప్రత్యక్షం అయ్యాయి. ప్రతిపేద వాడికి ఇల్లు, యువతకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రమ్య పేరుతో చేతి రాతతో రాసి ఉన్న పోస్టర్లు వెలిశాయి. ' మద్యం తాగేవారిని కాదు ఆ మద్యం తయారు చేసే కంపెనీ వారిని పట్టుకోండి. గెలిచేవరకు ఒక మాట గెలిచిన తర్వాత మరో మాట. ఎక్కడో ఇండ్లు ఇచ్చి ఇచ్చామని చెప్పుకోవడం కాదు. అందరికీ ఇచ్చామో లేదో అది చూసుకోండి. సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం కాదు. తెలంగాణలో ఇల్లు లేని వారు ఉండొద్దు. చదువుకున్నవారికి ఉద్యోగాలు ఇవ్వాలి. నాలుగు కార్లు వేసుకుని తిరగడం కాదు. మీ కాలతో పాదయాత్ర చేయండి అప్పుడే ప్రజల తిప్పలు మీకు అర్థం అవుతుంది.

## కేరళలో నిఫా వైరస్ కల్లోలం.. సరిహద్దుల్లో హై అలర్ట్!


2 లో

## తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం పోలీసుల అదుపులో మహిళ

మొదటి పేజీ తరువాయి



చేసిన కష్టం ఇంటి కిరాయిలకే:

పల్లెటూర్లో పాదయాత్ర చేసినట్టు కాదు హైదరాబాద్ లో పాద యాత్ర చేయండి. అప్పుడే ఎంత మంది కిరాయికి ఉంటున్నారో మీకు అర్థం అవుతుంది. పల్లెటూరులో ఇల్లు ఇచ్చి పదే పదే చూపించుకోకండి. హైదరాబాద్ లో ఇల్లు ఇచ్చి అందరినీ ఆదుకోండి. చేసిన కష్టం ఇంటి కిరాయిలకే పోతుంటే పిల్లల్ని ఎలా చదివించుకుంటాం. ఎలా బతుకుతాం. బాధలు పడి చదివిన విద్యార్థులకు జాబులు ఇవ్వడం లేదు. ఇవి పిచ్చి గీతలు అనుకోకండి. పేదలు తలచుకుంటే రాజకీయ పార్టీలను గెలిపించాలన్నా పడగొట్టాలన్నా ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రజల సమస్యలను పట్టించుకోకుంటే ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లతారు. అది మీ ఇష్టం. అందుకే తెలగాణను దోచుకోవడం బంద్ చేసి ప్రజలను పట్టించుకోండి. నేను అడిగిన ప్రశ్నలకు త్వరలోనే సమాధానం చెబుతారని అనుకుంటున్నా. ఎన్ని ఏళ్లు అయినా పేదలు పెదవారిగానే, కోటీశ్వర్లు వందల కోట్లు సంపాధిస్తూ మరింత కోటీశ్వరులుగా అవుతున్నాయి. తెలంగాణ సంపద అందరిదీ అని అంబేద్కర్ చెప్పాడు. కానీ ఇప్పుడు కొంత మందితే ఈ సంపద అయిపోయింది. నేను చెప్పిన దాంట్లో ఎదైనా తప్పు ఉంటే క్షమించాలి. లేదంటే నా పేపర్లు అన్ని చించి పారేయండి నా దారిన నేను పోతాను' అంటూ ఈ పోస్టర్లపై రాసి అతికించారు.

పోలీసుల అదుపులో మహిళ:


ఈ పోస్టర్లను గమనించిన సిబ్బంది వాటిని తొలగించారు. అయితే సచివాలయం వంటి హై సెక్యూరిటీ జోన్‌లో పోస్టర్లు అంటించడం చర్చనీయాంశంగా మారింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఆమెను సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తీవ్ర సంక్షోభం.. ఆదుకోండి: చంద్రబాబుకు బీజేపీ స్టేట్ అధ్యక్షుడి లేఖ



**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతి భారీగా వచ్చిన పంటకు సరైన రేటు లేకపోవడంతో నష్టపోతున్నారు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ప్రతి పార్టీ నాయకులకు తమ పరిస్థితిని విన్నవించుకుంటున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. చిత్తూరు జిల్లా మామిడి రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, మామిడి కొనుగోళ్లలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. మామిడికి కనీస మద్దతు ధర ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు ఇందిరా గాంధీ బ్రతికి ఉంటే బీజేపీని బ్యాన్ చేసేవారు: మాజీ సీఎం అశోక్ గెహ్లాట్



**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అశోక్ గెహ్లాట్.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేడు గనుక మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బ్రతికి ఉండి ఉంటే, మతాన్ని రాజకీయం కోసం వాడుకుంటున్న బీజేపీ లాంటి పార్టీపై ఖచ్చితంగా నిషేధం (బ్యాన్) విధించేవారని గెహ్లాట్ వ్యాఖ్యానించారు. దేశాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, ముస్లింలను లక్ష్యంగా చేసుకుని కావాలనే మతపరమైన ఎజెండాను ముందుకు నెడుతూ బీజేపీ దేశాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆరోపించారు. తాము కేవలం 'హిందుత్వ' పార్టీ అని దేశ ప్రజలకు నిరూపించుకోవడానికే వారు ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న ఇలాంటి శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఈ కూటమికి రాహుల్ గాంధీ బహిరంగంగా నాయకత్వం వహించాలని గెహ్లాట్ కోరారు. గతంలో ఇందిరా గాంధీ కాలంలో 'కాంగ్రెస్ హఠావో, దేశ్ బచావో' అంటూ విపక్షాలన్నీ ఏకమైనప్పటికీ.. కేవలం రెండున్నర ఏళ్లలోనే ప్రజలు ఆమెను తిరిగి అధికారంలోకి తెచ్చారని గుర్తుచేశారు. ప్రజలు నిజం గ్రహించి కాంగ్రెస్ వైపు నిలబడిన రోజున.. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా మారుతాయని అశోక్ గెహ్లాట్ ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఓటర్లకు అలర్ట్.. జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..!

మొదటి పేజీ తరువాయి




జిల్లా ఎన్నికల అధికారుల వారిగా క్షేత్ర స్థాయిలో ఈ సన్నద్ధత కార్యక్రమాన్ని చేపడతారు. ఇక రెండో దశలో సర్ సర్వేలో డిఈఓ, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓ పర్యవేక్షకులు, బిఎల్‌ఓలకు శిక్షణ అందిస్తారు. మూడో దశలో సర్వేలో భాగంగా ఇంటింటికి అందించే ఎన్యుమరేషన్ పత్రాలని ముద్రిస్తారు. సన్నద్ధత ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఓలు సర్ సర్వేను నిర్వహిస్తారు. జూలై 31న ముసాయిదా జాబితాను ప్రదర్శించనున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు అభ్యంతరాల స్వీకరణ సందేహాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారు. వారి గుర్తింపు కార్డుల పరిశీలన ప్రక్రియలను చేపడతారు. అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితాను ప్రదర్శిస్తారు.

## కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి



అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించిన అనాలోచిత తీరు వల్ల రెండు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అశాంతి నెలకొన్నాయని.. ఆ తప్పుడు విభజన వల్లే నేటికీ రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపిణీ సహా పలు వివాదాలు నలుగుతూనే ఉన్నాయని ఆయన పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. విభజన శక్తులపై రాజీలేని పోరాటం చేయడమే తెలంగాణలో జనసేన ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి తమకున్న ఏకైక నిబద్ధత అని గుర్తుచేశారు. అలాగే సొంత రాష్ట్రాల్లో 'ఢిల్లీ మెడలు వంచుతాం' అంటూ ప్రగల్భాలు పలికే నాయకులు, తీరా ఇక్కడికి రాగానే నోరు విప్పలేకపోతున్నారంటూ పరోక్షంగా ఇతర రాజకీయ పక్షాలపై పవన్ కల్యాణ్ పదునైన విమర్శలు గుప్పించారు.

## కేరళలో నిఫా వైరస్ కల్లోలం.. సరిహద్దుల్లో హై అలర్ట్!




**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** కేరళం రాష్ట్రంలో మరోసారి నిఫా వైరస్ కలకలంగా మారింది. గంటగంటకు పెరుగుతున్న పాజిటివ్ కేసులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోజికోడ్‌లో ఈ నిఫా వైరస్ కలకలం రేపుతోంది. అక్కడ రెండు వందల మందికి పైగా ఈ వైరస్ బారిన పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో పొరుగు రాష్ట్రమైన తమిళనాడు అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు పంచుకుంటున్న కోయంబత్తూర్, తెని, కన్యాకుమారి తో పాటు కడలూరు జిల్లాల వైద్య ఆరోగ్య శాఖలను తమిళనాడు ప్రభుత్వం హై అలర్ట్ చేసింది. సరిహద్దు దాటి వచ్చే ప్రయాణికులపై నిఘా ఉంచడంతో పాటు, నిఫా లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వారిని వెంటనే గుర్తించి మెడికల్ క్యాంపులకు తరలిస్తున్నారు. వైరస్ రాష్ట్రంలోకి వ్యాపించకుండా తమిళనాడు సర్కార్ అన్ని ముందస్తు జాగ్రత్తలు ముమ్మరం చేసింది. దీంతో కేరళం, తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

## మెట్రోపై బీజేపీ-బీఆర్ఎస్ కుట్ర?



**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలంటే అంతర్జాతీయ ప్రమాణాల రవాణా సౌకర్యాలు అవసరమని, ఆ ఆలోచనతోనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రారంభించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో రైలు నిర్మాణ నిర్ణయం యూపీఏ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కలిసి తీసుకున్నారని గుర్తు చేశారు.

ప్రారంభంలో రూ.15 వేల కోట్ల అంచనాతో మెట్రో పనులు చేపట్టారని.. 2017 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లారని సీఎం తెలిపారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక ప్రాంతాల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో 2014 నుంచి 2017 వరకు నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఫలితంగా 2020 నాటికీ ప్రాజెక్టు పూర్తికాలేదని, గౌలిగూడ ప్రాంతంలో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని చెప్పారు. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.20 వేల కోట్లకు చేరిందన్నారు.

మెట్రో విస్తరణ విషయంలో గత ప్రభుత్వం ప్రజల అవసరాల కంటే కొందరు రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించిందని రేవంత్ విమర్శించారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాలకు మెట్రో విస్తరణ జరగలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెట్రో రెండో దశ విస్తరణ చేపట్టాలని నిర్ణయించిందన్నారు. మెట్రో ఫేజ్-2కు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులను పలుమార్లు కోరామని తెలిపారు. ఎల్ అండ్ టీ సంస్థను కూడా విస్తరణకు ఒప్పించే ప్రయత్నం చేశామని, అయితే గత ప్రభుత్వ విధానాల కారణంగా తమకు రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని చెబుతూ సంస్థ సహకరించలేదని వివరించారు. రూ.13,600 కోట్ల అప్పుతో పాటు భారీ వడ్డీ భారం కారణంగా నష్టాల్లో ఉన్నామని ఎల్ అండ్ టీ చెప్పిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కూడా ఫేజ్-2కు ముందుగా ఎల్ అండ్ టీ అనుమతి తీసుకురావాలని సూచించిందని, మళ్లీ చర్చలు జరిపినా సంస్థ అంగీకరించలేదని చెప్పారు. ఈ విషయాన్ని కేంద్రానికి వివరించగా, ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను కొనుగోలు చేయాలని సూచించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు అంగీకరించిందని తెలిపారు. దాదాపు రూ.30 వేల కోట్ల విలువైన ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను రూ.15 వేల కోట్లకే కొనుగోలు చేసే ప్రక్రియ ప్రారంభించామని సీఎం వెల్లడించారు. ప్రతి ఏడాది సుమారు రూ.400 కోట్ల నష్టం వస్తున్నందున సంస్థ కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించిందన్నారు. అలాగే రూ.13,600 కోట్ల అప్పును తక్షణమే చెల్లించడం ద్వారా వడ్డీ భారం తగ్గించవచ్చని వివరించారు.

తక్కువ వడ్డీకి రుణాలు పొందేందుకు ప్రయత్నించామని.. ఇందుకోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ తో చర్చలు జరిపామని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి భారీగా అప్పులు తెచ్చుకుందని ఆరోపించిన సీఎం.. తాము కేవలం 4 శాతం వడ్డీకి రుణం పొందేందుకు అనుమతులు సాధించామని చెప్పారు. దీంతో మెట్రో ప్రాజెక్టు మొదటి రోజునుంచే లాభదాయకంగా మారే అవకాశం ఉందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో నిధుల విడుదలను నిలిపివేసిందని రేవంత్ ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖతార్‌లో జరిగిన సమావేశాల్లో జోక్యం చేసుకున్నారని పేర్కొంటూ.. తెలంగాణలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మెట్రో విస్తరణకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు.

కేంద్ర భాగస్వామ్యం అవసరం లేదని, కనీసం ఎన్‌వోసీ ఇచ్చి ప్రాజెక్టును ముందుకు సాగనివ్వాలని తాను కోరానని సీఎం తెలిపారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ కలిసి మెట్రో విస్తరణను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడమే వారి లక్ష్యమని విమర్శించారు. మెట్రో విస్తరణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో కిషన్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం సహకరించాలని సీఎం డిమాండ్ చేశారు.

## తెలంగాణలో డిజిటల్ పాలన.. ఈ-కేబినెట్‌కు గ్రీన్ సిగ్నల్!

మొదటి పేజీ తరువాయి




దీని ద్వారా మంత్రులకు పంపే కేబినెట్ అజెండా నోట్స్, ప్రతిపాదనలు అన్నీ కూడా ఎలక్ట్రానిక్ విధానంలోనే పంపనున్నారు. సమావేశంలో తీసుకునే కీలక నిర్ణయాలు, ఆమోదించే తీర్మానాలు సైతం వెంట వెంటనే డిజిటల్ రూపంలో రికార్డు కానున్నాయి.

ఈ-కేబినెట్ విధానం వల్ల ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. కాగితాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా.. ప్రభుత్వ వ్యయం కూడా భారీగా తగ్గుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అత్యంత కీలకమైన, రహస్యమైన సమాచారం బయటకు పొక్కకుండా పటిష్టమైన భద్రత లభిస్తుంది. ప్రతి నిర్ణయం ఆన్‌లైన్ వ్యవస్థలో నిక్షిప్తం కావడం వల్ల పరిపాలనలో జవాబుదారితనం మరింత పెరుగుతుంది. భారతదేశంలో ఇటువంటి పేపర్‌లెస్ కేబినెట్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఈ డిజిటల్ విధానాన్ని అందిపుచ్చుకున్నాయి. ఇప్పుడు అదే బాటలో తెలంగాణ కూడా చేరబోతోంది.

ఈ-కేబినెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధ్యాసాధ్యాలు, సాంకేతిక ఏర్పాట్లపై ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఐటీ, జీఏడీ ఉన్నతాధికారులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ట్యాబ్‌ల పనితీరు, సాఫ్ట్‌వేర్ భద్రత, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్న రోజుల్లో జరగబోయే తదుపరి రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ప్రయోగాత్మకంగా లేదా పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలోనే నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

## ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ!



**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. మెట్రో టేకోవర్?పై సందిగ్ధత ఏర్పడడంతో నెక్స్ట్ ఏం చేయాలన్న అంశంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. త్వరలో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందునా ఈ అంశంపై కూడా మంత్రి వర్గంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గురువారం జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశం ఎలక్ట్రానిక్ విధానంలో జరగనుంది. రాష్ట్రంలో ఇకపై ఈ-కేబినెట్ మీటింగ్స్ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు. పరిపాలనలో పేపర్ లెస్ విధానం తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు.

## 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** గతకొన్ని నెలలుగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోన్న కాక్రోచ్ జనతా పార్టీపై జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట జనసేన ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'చాలాసార్లు మనకుమనం తక్కువ అంచనా వేసుకున్నాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావచ్చు. ఈ మధ్య కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో అందరం చూస్తూనే ఉన్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే చలిచీమల పద్యం గుర్తుకు వస్తోంది. చలి చీమలు కూడా బలమైన పాములను చంపేస్తాయి. ఒక లక్ష్యం పెట్టుకుని.. ఆ లక్ష్యం దిశగా ప్రయత్నం చేస్తే ఎవరైనా సక్సెస్ అవుతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

అంతకుముందు.. జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. కానీ ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నాము, విజయాలూ సాధించామని చెప్పారు. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన జనసేన, నేడు 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయని అన్నారు. అంతేగాకుండా.. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ అని పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిరసన చీఫ్ అభిజీత్ దీప్కేపై దుండగుల అటాక్



**న్యూస్ డెస్క్,15 జూన్ (ఇది కద నిజం):** నీట్ పరీక్షల పేపర్ లీకేజీ, పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపట్టారు. అయితే, ఈ ఆందోళనల సందర్భంగా అభిజీత్ దీప్కేపై దుండగులు మొఖంపై చంపదెబ్బలతో ఒక్కసారిగా అటాక్ చేశారు. అసలు ఏం జరుగుతుందో తేరుకునే లోపే దాడి చేసిన వారు అక్కడి నుంచి పరార్ అయ్యేందుకు ప్రయత్నించగా సీజేపీ కార్యకర్తలు పట్టుకుని తిరిగి వారికి దేహశుద్ధి చేశారు. కాగా, గత నెలలో కూడా అభిజీత్ దీప్కేకు వాట్సాప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని బెదిరింపులు వచ్చిన మాట వాస్తవమే. ఆ సమయంలో ఆయన సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేయడానికి కొందరు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే జైపూర్‌లో నిరసనల వేళ ఆయనకు భారీ భద్రత కల్పించనప్పటికీ దుండగులు దాడి చేయడం గమనార్హం. ప్రస్తుతం దాడికి సంబంధించి వీడియోలు సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 16-06-2026

# నాబార్డ్ ఆధ్వర్యంలో ఎదులాబాద్‌లో 20 రోజుల LEDP శిక్షణా కార్యక్రమం ప్రారంభం



ఇది కద నిజం:మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో నాబార్డ్ ఆర్థిక సహాయంతో, వివేకానంద యువజన సంఘం నిర్వహణలో "మత్స్య పరిశ్రమ మరియు అలంకార ఆక్వాకల్చర్ వ్యవస్థాపక అభివృద్ధి" అంశంపై 20 రోజుల జీవనోపాధి మరియు వ్యాపారాభివృద్ధి కార్యక్రమం (LEDP) 15-06-2026న విజయవంతంగా ప్రారంభమైంది. శిక్షణార్థుల నమోదు ప్రక్రియతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి నాబార్డ్ మేడ్చల్ జిల్లా అభివృద్ధి మేనేజర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత, మహిళలు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలుపుతూ, స్వయం ఉపాధి మరియు మత్స్య పరిశ్రమ ద్వారా లభించే స్థిరమైన జీవనోపాధి అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం సమన్వయకర్త శ్రీపాద సుధాకర్, రిసోర్స్ పర్సన్స్ కె. శ్రీశైలం, సోల్మన్ తదితరులు పాల్గొని, శిక్షణార్థులు మత్స్య పరిశ్రమ, అలంకార చేపల పెంపకంపై అవగాహన పెంచుకుని భవిష్యత్తులో సొంతంగా వ్యాపార యూనిట్లను స్థాపించి రాణించాలని పిలుపునిచ్చారు.

# బహదూర్ పురాలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం



ఇది కద నిజం: తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ద్వారా జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బహదూర్ పురా నియోజకవర్గం దేవీబాగ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం 15-06-2026న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ట్రైనర్ Dr. M.S. అన్సారి విచ్చేసి బి.ఎల్.ఎ ల బాధ్యతలను వివరంగా వివరించారు. ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభం కాబోయే ఎన్యూమరేషన్ ఫేజ్ లో భాగంగా బి.ఎల్.ఎ లు, బి.ఎల్.ఓ లతో కలిసి తమకు కేటాయించిన బూత్ లోని ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ శిక్షణలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఖలీద్ సైఫుల్లాహ్, రాష్ట్ర కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ మరియు బహదూర్ పుర నియోజకవర్గ ఇంచార్జ్ పులిపాటి రాజేష్ కుమార్ పాల్గొని, ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ భవాని త్రివేది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్, జబ్బార్, టి. చంద్రశేఖర్, భాను చందర్ యాదవ్, జ్యోతి శెట్టి, ఫాయాజ్, నసీర్ ఫరూక్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# 18 న కడపలో కూటమి రెండేళ్ల సుపరిపాలన బహిరంగ సభ.




కడపజిల్లా(ఇది కద నిజం)జూన్ 15:ఈ నెల 18 న కడపలో తెలుగుదేశం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే రెండేళ్ల సుపరిపాలన జిల్లాస్థాయి బహిరంగ కార్యక్రమానికి సభాస్థలి పరిశీలన చేస్తున్న కార్యక్రమంలో టీడీపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి, కమీషనర్ భావన,ఆర్డీఓ మురళి,తహసీల్దార్ చాంద్ బీ,పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ జనార్దన్,టిఎన్ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్,ఆధ్వర్యంలో కలిసి కడపజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి స్తభాస్థలిని పరిశీలించారు. అనంతరం కడప నగరంలోని టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 18 న కడప కేంద్రంగా పెద్ద ఎత్తున తెలుగుదేశం కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి కూటమి రెండేళ్ల సుపరిపాలన గురించి వివరిస్తూ సభను నిర్వహించే కార్యక్రమం చేపడుతున్నామని,తెలుపుతూ.. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోంది అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. కొప్పర్తి స్టీల్ ప్లాంట్, గ్రీన్ ఎనర్జీ,సోలార్ ప్రాజెక్టులతో కడపజిల్లా అభివృద్ధికి కొత్తదశ ఏర్పడుతుందన్నారు.ఇకపోతే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అమరావతి నిర్మాణం, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయి అన్నారు.. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు హరిప్రసాద్, ఆప్కాబ్ చైర్మన్ యాటగిరి ప్రసాద్,తెలుగుదేశం నాయకులు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు..

# హోంమంత్రి అనితకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురించి మాట్లాడే అర్హత లేదు



ఇది కద నిజం న్యూస్ ,విశాఖ, జూన్ 15 : హోంమంత్రి అనితకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురించి మాట్లాడే అర్హత లేదు. నీ పదవి కాపాడుకోవడం కోసం గుడివాడ అమర్నాథ్ పై విమర్శలు చేస్తున్నావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ నాయకులు

రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనిత గారు మాజీ మంత్రి శ్రీ గుడివాడ అమర్నాథ్ గారిపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరంగా, బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ నాయకురాలు మండిపడ్డారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగత విమర్శలు చేయడం, కుటుంబాల చరిత్రను అవమానించే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గారు విశాఖ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు కలిగిన రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన కుటుంబం తరతరాలుగా ప్రజా సేవలో ఉందని, మాజీ శాసన సభ్యులు స్వర్గీయ గుడివాడ అప్పన్న గారు ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. అలాగే ఆయన తండ్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు గారు ఎమ్మెల్యేగా, విద్యాశాఖ మంత్రిగా సేవలందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. అలాంటి కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తిపై వ్యాఖ్యలు చేసే ముందు కనీస అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత హోంమంత్రిగా అనిత గారికి ఉందని అన్నారు. గుడివాడ అమర్నాథ్ గారిపై వ్యాఖ్యలు చేయడం అంటే కేవలం ఒక వ్యక్తిని విమర్శించడం మాత్రమే కాదని, దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తున్న ఒక కుటుంబ ని అవమానించడమే అవుతుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలపై ఉండాలి తప్ప వ్యక్తులపై, కుటుంబాలపై ఉండకూడదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో హుందాతనం, పరస్పర గౌరవం కొనసాగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను హోంమంత్రి అనిత గారు వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశం లో మాజీ డి.సి.ఎం.ఎస్ చైర్మన్ పళ్ళ చిన్న తల్లి , జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షులు శ్రీ దేవి వర్మ , జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జియ్యని వెంట సత్య , జిల్లా అంగన్వాడి విభాగం ఉపాధ్యక్షురాలు ఇప్పిలి పార్వతి పాల్గొన్నారు .

# గ్యాంబ్లింగ్ పై "కడప ఎస్పీ నచికేత్"ఉక్కుపాదం..!!

**సిద్ధవటం పోలీస్ స్టేషన్ పరిధిలో మాచుపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి.**

**2,79,060/-ల నగదు,52 పేక ముక్కలు,రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం, 8 మంది అరెస్టు**



కడపజిల్లా(ఇది కద నిజం)జూన్ 15:సిద్ధవటం మండలంలోని మాచుపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు సిద్ధవటం పోలీసు సిబ్బంది పేకాట ఆడుతున్న వారిపై మెరుపు దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులనుఅదుపులోకి తీసుకొని,వారి వద్ద నుండి రూ.2,79,060/-ల నగదు, 52 పేక ముక్కలు మరియు రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.జిల్లా వ్యాప్తంగా చట్ట వ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు నిరంతరం దాడులు నిర్వహిస్తూ ఉంటారని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ హెచ్చరించారు.

# గండికోటలో ప్రత్యేక యోగ ప్రదర్శన..



కడపజిల్లా (ఇది కద నిజం) జూన్ 15: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం పొందవచ్చునని, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర క్యాంపెయిన్-2026 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.నేటి వేగవంతమైన జీవనశైలిలోఒత్తిడి, ఆందోళన, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు యోగా ఒకదివ్య ఔషధంగా సమర్థవంతమైన పరిష్కారాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# కార్మిక, జౌళి మరియు నైపుణ్యాభివృద్ధి స్థాయి సంఘం ఒడిశా పర్యటనలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి...




ఝార్సుగూడ (ఇది కద నిజం)జూన్: 15 కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి స్థాయీ సంఘం యొక్క అధ్యయన పర్యటనలో భాగంగా ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన పర్యటనలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, కార్మిక చట్టాల అమలు, మరియు సాంప్రదాయ చేతివృత్తులు, అంతరించిపోతున్న కళల ప్రోత్సాహంపై జరిగిన పలు చర్చలలో పాల్గొన్నారు. కార్మిక పరిపాలన అధికారులు, ఈపి ఎఫ్ ఓ మరియు ఈ ఎస్ ఐ సి ప్రతినిధులతో పాటు, కాంట్రాక్ట్, తాత్కాలిక కార్మికులకు సంబంధించిన సమస్యలు మరియు సంక్షేమ చర్యల సమర్థవంతమైన అమలుపై బ్యాంక్ ఆఫ్ ఇండియా, బి ఎస్ ఎన్ ఎల్ మరియు మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ యాజమాన్యాలతో పలు అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో అత్యంత విజ్ఞానదాయకమైన అంశాలలో ఒకటి భూగర్భ బొగ్గు గని పర్యటన అని గనుల తవ్వకం కార్యకలాపాలను ప్రత్యక్షంగా చూడటం వల్ల, వేలాది మంది కార్మికులు ప్రతిరోజూ తమ విధులను నిర్వర్తించే క్లిష్ట పరిస్థితులపై లోతైన అవగాహన కలిగిందని హరీష్ అన్నారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి మరియు కార్మికుల జీవితాలు, జీవనోపాధిని మెరుగుపరచడానికి తన కృషిని కొనసాగిస్తుందని ఎంపీ హరీష్ పేర్కొన్నారు.

# ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ విజయక్రిష్ణన్



అనకాపల్లి (తిమ్మరాజుపేట) జూన్ 15: జిల్లా కలెక్టరు, జిల్లా జాయింట్ కలెక్టరు వ్యవసాయ అధికారి ఆశాదేవి తో కలసి అనకాపల్లి జిల్లాలోని అచ్చుతాపురం మండలం, తిమ్మరాజుపేట గ్రామములో గల సురేష్ ఫెర్టిలైజర్స్ అను ఎరువుల దుకాణమును తనిఖీలో ప్రభుత్వము వారు నూతన పద్దతిలో ప్రవేశపెట్టిన ఎరువుల సరఫరా విధానమును జిల్లా కలెక్టరు మరియు జిల్లా జాయింట్ కలెక్టరు వారు పరిశీలించారు. ఈ విధానములో రైతుల యొక్క భూమిని ఎరువుల సరఫరాకు అనుసందానిస్తు ఎ.పి.ఎ.ఐ.ఎం.ఎస్. పోర్టల్ ద్వారా ప్రై వేటు డీలర్లు, మండలములోని సొసైటీలు,రైతు సేవా కేంద్రాలు ద్వారా ఎరువుల సరఫరా చేయడం జరుగుతుంది. కేవలము భూయజమానికే కాకుండా కౌలు చేస్తున్న ఏ రైతుకైన (Tenent without CCRC) ఎరువుల సరఫరా చేయడం జరుగుతుంది. ఈ పద్దతి వలన వ్యవసాయము చేయని వారికి ఎరువుల సరఫరాను అడ్డుకట్ట వెయడం అవుతుంది. ఇదే సందర్భములో సదరు ఎరువుల దుకాణములో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని జిల్లా కలెక్టకి రైతులు ఫిర్యాదు చెయడం జరిగింది. దీనిపై వెంటనే జిల్లా కలెక్టరు వారు స్పందిస్తు ఎరువుల దుకాణమునకు 21 దినములు వరకు ఎటువంటి ఎరువులు విక్రయము చేయరాదని (స్టప్ సేల్) అదేవిదంగా దుకాణములో ఉన్న 25.02 టన్నుల (556 బస్తాలు)యురియా ఎరువులను సీజ్ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వారిని ఆదేశించడము జరిగినది. జిల్లాలోని ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో సంబంధిత మండల టాస్కోర్స్ అధికారులుచే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అధిక ధరలకు విక్రయించే ఎరువుల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకొనవలెనని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించడము జరిగినది.

ఈ కార్యక్రమములో ఎం.ఆశాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి, మరియు బి.సంఖర్ గొవింద్, మండల వ్యవసాయ అధికారి మరియు స్థానిక రైతులు పాల్గొనడం జరిగినది.

# వెంకటగిరి నియోజకవర్గ రైతాంగ సంక్షేమమే నా మొదటి ప్రాధాన్యత: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి (ఇది కద నిజం):- వెంకటగిరి నియోజకవర్గంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం వెంకటగిరి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమం లో పాల్గొన్ని అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను ఎటువంటి కొరత లేకుండా ఎకరాకు మూడు బస్తాల చొప్పున సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.నియోజకవర్గంలో భూమికి సంబంధించిన వివాదాలు, గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న తప్పుడు డాక్యుమెంట్ల తయారీ వంటి సమస్యలను పూర్తిగా అరికడతామని, అర్హులైన రైతులకే పట్టాదారు పాసుపుస్తకాలు అందేలా పారదర్శకమైన వ్యవస్థను రూపొందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి శుక్రవారం నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా అధికారులు నిరంతరం పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాలనను ప్రజలకు చేరువ చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రామకృష్ణ గారు ఉద్ఘాటించారు.

# 15లో 11 డిఎస్సీలు టీడీపీలో తీసినవే

## రద్దు చేసేందుకు అవి వాలంటరీ ఉద్యోగాలు కావు

## టీడీపీ నేతలు వెల్లడి!



కాకినాడ, (ఇది కద నిజం) జూన్ 15: ఇప్పటివరకు టీచర్ల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఎంపికలలో 11 తమ టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసినవేనని టీడీపీ నాయకులు వెల్లడించారు. ఎంతోకాలం కష్ట పడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన వారిని రద్దు చేయిస్తానని వైసీపీ నేతలు చెప్పడం వారి అవివేకతనానికి నిదర్శమని వారు పేర్కొన్నారు. సోమవారం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం డీఎస్సీని నిష్పక్షపాతంగా నిర్వహించిందన్నారు. ఉద్యోగాలు పొంది సుమారు 6 నెలలు దాటినా ఇప్పుడు వైసీపీ వారు అందులో అక్రమాలు జరిగాయని పేర్కొనడం పట్ల వారి అవివేకం బయటపడిందన్నారు. వైసీపీకి చెందిన మరి కొందరైతే డిఎస్సీ రద్దు చేస్తామని చెప్పి ఎంపికైన ఉపాధ్యాయులలో భయాందోళనలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. వారు ఆరుగాలం కష్టపడి చదివి ఉద్యోగం సాధించారని వారు ఏ ప్రభుత్వ దయ దక్షిణాల మీద ఆధారపడలేదన్నారు. తీసి పడేయడానికి వారు చేస్తున్నవి వాలంటీర్ ఉద్యోగాలు కాదని రాజశేఖరం ఎద్దేవ చేశారు. ఇకనుంచి ప్రతి ఏడాది డీఎస్సీ, గ్రూప్ స్థాయి వంటి ఉద్యోగాలకు నియామకం జరుగుతుందని పేరాబత్తుల చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ వాళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అక్రమాలు, అవ్వకతవకలపై విద్యాశాఖ కార్యదర్శి ఆధారాలు చూపించాలని కోరినా వారు అందుకు వెనుదిరిగిన సంఘటనను గుర్తు చేశారు. నాడు బి నేడు పేరుతో వైసీపీ గోడలకు రంగులు, సున్నాలు మాత్రమే వేసిందని టీచర్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని చెప్పారు. వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పి వనమాడి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్సీలో ఉపాధ్యాయులు ఎంపికైన వారి అనుభవాలు, కష్టపడిన తీరులను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ రవి, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ ప్రదీప్ కుమార్, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఎన్ సత్యనారాయణ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి సూరిబాబు, సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం రవికుమార్, పిఈటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# లోపాల కంటే కంటెంట్ ముఖ్యం



థియేటర్స్‌లో సక్సెస్ అందుకున్న కొన్ని సినిమాలు, ఓటీటీలో వివాదాలకు దారి తీస్తాయి. ఇప్పుడు ఇదే చిక్కు 'కరుప్పు'కు వచ్చింది. స్టార్ హీరో సూర్య, డైరెక్టర్ ఆర్‌జే బాలాజీ కలయికలో వచ్చిన ఈ మూవీ.. బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అయితే.. రీసెంట్‌గా ఓటీటీలోకి వచ్చి సరికొత్త వివాదంలో చిక్కుకుంది. డిజిటల్ స్క్రీన్‌పై అత్యంత క్లారిటీగా సినిమాను చూస్తున్న నెటిజన్లు.. ఇందులో ఉపయోగించిన కొన్ని సాంకేతిక లోపాలను ఈజీగా గుర్తుపట్టేస్తున్నారు. ఫైట్ సీక్వెన్స్‌లలో డూప్‌లను ఉపయోగించి, ఆ తర్వాత వీఎఫ్ఎక్స్ సహాయంతో సూర్య ముఖాన్ని ఫేస్-స్వాప్ చేయడం వంటివి కనిపెట్టి స్క్రీన్ షాట్ల సాక్ష్యాలతో సహా ట్రోల్స్ చేస్తున్నారు.

అయితే.. తాజాగా దీనిపై స్పందించిన డైరెక్టర్ ఆర్‌జే బాలాజీ.. 'ఈ సినిమా ఓటీటీలో విడుదలైంది.. సాధారణంగా, థియేటర్లలో వచ్చిన మంచి సినిమాను ఓటీటీలో చూసేటప్పుడు ప్రజలు ప్రతి ఫ్రేమ్‌ను నిశితంగా గమనిస్తూ.. ముఖం వేరేలా కనిపించడం వంటి చిన్న చిన్న లోపాలను ఎత్తి చూపుతుంటారు. అయితే.. ఓటీటీలో సినిమా చూస్తున్నప్పుడు కొన్ని లోపాలు కనిపించవచ్చు.. కానీ వాటికంటే ఇందులో కంటెంట్ ముఖ్యం కదా. కాబట్టి, సినిమాను ఆస్వాదించండి' అంటూ చెప్పుకొచ్చాడు. అలాగే ఇటీవల సీఎం విజయ్‌ను కలిసినట్లు ఓ ఫొటో షేర్ చేస్తూ.. 'ఇటీవల నేను విజయ్ సర్‌ను కలిశాను.. 'కరుప్పు' చిత్రానికి ప్రజలు ఆదరిస్తున్న తీరు, సినిమా విజయం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.. ప్రజలు ఎంతో నమ్మకంతో ఆయనకు ఓట్లు వేసి గెలిపించారు.. ఆయన ఇక్కడ ఉండటం చలనచిత్ర పరిశ్రమకు ఎంతో ప్రయోజనకరం' అని తెలిపారు.

# కార్తీక్ ఆర్యన్‌తో ప్రేమ..?



బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్, టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల గత కొద్దికాలంగా ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ విషయంపై వీరిద్దరు ఇప్పటివరకు అధికారికంగా ఎక్కడా స్పందించనప్పటికీ, తాజాగా జరిగిన ఒక సంఘటన వీరి ప్రేమ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. శ్రీలీల పుట్టినరోజును పురస్కరించుకుని కార్తీక్ ఆర్యన్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ఇంట్రెస్టింగ్ ఫొటోను షేర్ చేస్తూ.. హ్యాపీ బర్త్ డే శ్రీ శ్రీ అంటూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆ ఫొటోలో కార్తీక్ బైక్ నడుపుతుండగా, వెనుక కూర్చున్న శ్రీలీల బైక్ రియర్ వ్యూ మిర్రర్‌లో చూసుకుంటూ క్యూట్‌గా చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఈ రేర్ పిక్ చూసి అభిమానులు తెగ మురిసిపోతున్నారు. అయితే, అసలు కథ ఇక్కడే మొదలైంది.

కార్తీక్ ఆర్యన్ పెట్టిన ఈ బర్త్‌డే పోస్ట్‌కు శ్రీలీల స్పందిస్తూ.. థాంక్యూ స్వీటెస్ట్ అని రిప్లై ఇచ్చింది. అంతటితో ఆగకుండా ఆ మెసేజ్‌కు ఒక లవ్ సింబల్ ను కూడా జోడించడంతో ప్రేమపై హింట్ ఇచ్చిందని అంతా అనుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే కాదు, అంతకుమించి ఏదో ఉందంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న ప్రేమ నిజమేనంటూ సోషల్ మీడియాలో వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. కాగా.. వీరిద్దరి కాంబోలో ఓ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామా రాబోతుంది. అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీని భూషన్ కుమార్, క్రిషన్ కుమార్ టీ-సిరీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రీతమ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తున్నారు.

# అనిల్ రావిపూడి కొత్త సినిమా టైటిల్ ఇదేనా ?



టాలీవుడ్ స్టార్ దర్శకుడు అనిల్ రావిపూడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో 100% సక్సెస్ రేట్ ఉన్న వారిలో అనిల్ రావిపూడి కూడా ఉంటారు. ప్రతి సంక్రాంతికి ఫ్యామిలీ విత్ కామెడీ సినిమాతో వచ్చి సక్సెస్ అందుకుంటున్నారు. ఇక త్వరలోనే నందమూరి కళ్యాణ్ రామ్, విక్టరీ వెంకటేష్‌తో సినిమా చేయబోతున్నారు. ఈ మల్టీస్టారర్ షూటింగ్ మరికొన్ని రోజుల్లోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

వెంకటేష్, కళ్యాణ్ రామ్ లతో ఇప్పటికే సినిమాలు చేసి బంపర్ హిట్ అందుకున్నారు అనిల్ రావిపూడి. ఇక ఇప్పుడు ఈ ఇద్దరితో అదిరిపోయే సినిమా చేసి.. వచ్చే సంక్రాంతికి ప్రేక్షకులకు మంచి ట్రీట్ ఇవ్వాలని స్కెచ్ వేశారు. ఇలాంటి క్రమంలోనే ఈ మూవీ టైటిల్ గురించి సోషల్ మీడియాలో ఓ చర్చ జరుగుతోంది. సంక్రాంతి సరుకు అనే టైటిల్ ను చిత్ర బృందం పరిశీలిస్తున్నట్లు టాక్ నడుస్తోంది. సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో పండుగకు తగ్గట్టుగానే టైటిల్ ఉండాలని భావిస్తున్నారట. ఈ క్రమంలోనే ఈ సంక్రాంతి సరుకు అనే టైటిల్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# నటి రష్మికకు తప్పిన ప్రమాదం




సినిమా ప్రమోషన్ కోసం పూణేలోని ఒక ప్రముఖ షాపింగ్ మాల్‌కు వచ్చిన చిత్ర బృందానికి ఊహించని అనుభవం ఎదురైంది. అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో అక్కడ తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో తోపులాట జరగడంతో టాలీవుడ్ స్టార్ బ్యూటీ రష్మిక మందన్న భయాందోళనకు గురైంది. అయితే, సహనటి కృతి సనన్ వెంటనే అప్రమత్తమై రష్మికను తన చేతులతో చుట్టేసి, రక్షణ కవచంలా నిలిచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

అసలేం జరిగిందంటే...?

షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం "కాక్టైల్-2. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర యూనిట్ పూణేలోని ఒక షాపింగ్ మాల్‌లో మ్యూజిక్ లాంచ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేసింది. తమ అభిమాన నటీనటులను చూడటానికి వేలాది మంది అభిమానులు ఒక్కసారిగా మాల్కు చేరుకున్నారు. మొదట అంతా సజావుగానే సాగింది. నటీనటులు అభిమానులతో కలిసి సరదాగా 'వడా పావ్' తింటూ సందడి చేశారు. కానీ, సెలబ్రిటీలు స్టేజ్ మీదికి రాగానే ఒక్కసారిగా క్రౌడ్ కంట్రోల్ తప్పింది. అభిమానులు సెక్యూరిటీ బారికేడ్లను బద్దలు కొట్టుకుని నటీనటుల వైపు దూసుకొచ్చారు. అభిమానుల తాకిడికి సెక్యూరిటీ సిబ్బంది సైతం ఏమీ చేయలేకపోయారు. తీవ్రమైన తోపులాట జరగడంతో రష్మిక ఒక్కసారిగా కంగారుపడిపోయింది. ఆ సమయంలో కృతి సనన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా రష్మికను గట్టిగా పట్టుకుని, జనం ఆమెపై పడకుండా అడ్డుగా నిలబడింది. రష్మికను జాగ్రత్తగా గైడ్ చేస్తూ అక్కడి నుంచి సురక్షితంగా వెలుపలికి తీసుకువెళ్లింది. మరోవైపు హీరో షాహిద్ కేపూర్ సైతం ఈ గందరగోళం మధ్య తీవ్ర అసహనానికి లోనయ్యాడు. పరిస్థితి చేయి దాటిపోవడంతో నిర్వాహకులు ఈవెంట్‌ను మధ్యలోనే నిలిపివేసి, నటీనటులను అక్కడి నుంచి తరలించారు.

సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు..

కృతి సనన్ సమయస్ఫూర్తిని, రష్మిక పట్ల చూపించిన ప్రేమాభిమానాలను నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. అదే సమయంలో మాల్ యాజమాన్యం, నిర్వాహకుల సెక్యూరిటీ వైఫల్యంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ 'కాక్టైల్ 2 చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది. ముగ్గురి మధ్య సాగే లవ్ ట్రయాంగిల్ కథాంశంతో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

# మాస్ కాంబో సెట్



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 21వ తేదీన విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఇక ప్రస్తుతం రవితేజ కోసం మరో మాస్ దర్శకుడు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమిళ సినీ పరిశ్రమలో సూపర్ క్రేజ్ కలిగిన మాస్ దర్శకుల్లో ఒకరైన హరి తాజాగా రవితేజకు ఒక కథ వినిపించినట్లు తెలుస్తోంది. ఆ కథ రవితేజకు బాగా నచ్చడంతో, ఆయన ఈ దర్శకుడితో పనిచేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అన్ని అనుకున్నట్లుగా జరిగితే మరికొన్ని రోజుల్లోనే ఈ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. హరి దర్శకత్వంలో రూపొందిన 'సింగం' సిరీస్ చిత్రాలు తెలుగులో కూడా అద్భుతమైన విజయాలను సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ దర్శకుడికి తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు ఉంది. అందువల్ల రవితేజ - హరి కాంబినేషన్‌లో ఒక హై వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ వస్తే, దానిపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.